దేవాదిదేవా.. శ్రీవాసుదేవా

చిన్ననాటి కోరిక తీరింది!

రిటైర్డ్ జస్టిస్ రమణ



వేద సభల్లో పాల్గొనా లనే కోరిక చాలా మందికి ఉంటుంది.. కానీ ఆ అవకాశం కొంత మందికే వస్తుంది.. అలాగే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు ఆ కోరిక ఉంది. అంబాజీపేట మండలం నందంపూడిలో మంగళవారం నిర్వహించిన వేద సభలో అవకాశం వచ్చింది. దానిలో భాగంగా ఆ కోరికను బయటపెట్టారు. నాకు చిన్నప్పటి నుంచి వేదసభలో పాల్గొనాలనే కోరిక ఉండేదని, తాను నందంపూడి వేదసభలో పాల్గొని వేదఘోషను ఆస్వాదించడంతో నెరవేరిందని రమణ తెలిపారు. వేదసభలో పాల్గొని తన్మయత్వం పొందానని వెల్లడించారు. 7



అష్టదళ పాదపద్మారాధనకు 108 బంగారు పుష్పాలు

దేవాదిదేవా.. వాసుదేవా అంటూ వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామిని భక్తజనం కొలిచారు.. 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదో రోజైన మంగళవారం ఆలయంలోని వసంత మండపంలో ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని కన్నులారా చూసి మనసారా వేడుకున్నారు.. మంగళవారం రాత్రి మలయప్ప అలంకరణలో శ్రీవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. 6



ప్రజానంద.. పవనాలు!



ఉప్పాడలో గురువారం జరిగిన సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ (ఫైల్‌ఫోటో)

దెబ్బతిన్న బోట్లకు రూ.72 లక్షల పరిహారం

గురువారం సభలో హామీ ఇచ్చి.. నెరవేర్చిన పవన్

కొత్తపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ మినీహార్బర్ వద్ద దెబ్బతిన్న మత్స్యకారుల బోట్లకు ప్రభుత్వం రూ.72 లక్షల నష్టపరిహారం విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. నాలుగు రోజుల కిందట డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మత్స్యకారుల సమస్యలు తెలుసుకునేందుకు కాకినాడ వచ్చారు. అక్కడ కలెక్టరేట్‌లో మత్స్యకార ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఉప్పాడ హార్బర్ డిజైన్ లోపం కారణంగా తమ బోట్లు దెబ్బతిన్న విషయాన్ని మత్స్యకారులు ఆయన దృష్టికి తీసు కెళ్లారు. ఉప్పాడలో జరిగే సభకు వెళుతూ విహంగ వీక్షణం ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హార్బర్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. బోట్లు నష్టపోయిన మత్స్యకారులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం డిప్యూటీ సీఎం చొరవతో హార్బర్‌లో దెబ్బతిన్న బోట్లకు రూ.72 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు మత్స్యకారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు.. నెరవేర్చారు

- సెజ్ రైతులకు న్యాయం
- 2,180 ఎకరాలు ఇచ్చేలా జీవో
- రిజస్ట్రేషన్ ఫీజు మినహాయింపు
- 1551 మంది రైతుల ఆనందం
- బోట్లకు రూ.72 లక్షల పరిహారం

కొత్తపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ నాడు హామీ ఇచ్చారు.. అది నేడు నెరవేర్చారు. కేఎస్‌ఈజెడ్ (కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి) పరిధిలోని భూములను తిరిగి రైతులకు ఇప్పించేలా బాధ్యత తీసుకుంటానని గత ఎన్నికల సమయంలో పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. ఆ హామీని డిప్యూటీ సీఎం హోదాలో నిలబెట్టుకున్నారు. కాకినాడ సెజ్‌కు ఇచ్చిన భూముల్లో 2,180 ఎకరాలను తిరిగి రైతులకు ఇచ్చి మేలు చేయాలని ఆనాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు సెజ్‌లో అవార్డు భూములను తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆదేశాలిచ్చారు. ఈ రిజిస్ట్రేషన్‌కు రుసుములు, స్టాంపు డ్యూటీలు వసూలు చేయవద్దని ఆదేశాలిచ్చారు. దీంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో 1551మంది రైతులకు మేలు చేకూరనుంది.

సెజ్ రైతులకు ఊరట..

కాకినాడ సెజ్ పరిధిలో రైతులకు వెనక్కిచ్చిన భూమి తిరిగి రైతుల పేరున రిజిస్ట్రేషన్ కాక సతమతమవుతున్నారు. దీంతో డిప్యూటీ సీఎం గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సరిచేస్తూ రైతులకు న్యాయం చేశారు. గత ప్రభుత్వంలో కేఎస్‌ఈజెడ్ భూములపై జీవోనెం.12 విడుదలైనా క్షేత్ర స్థాయిలో రైతులకు మేలు జరగలేదు. దీంతో పిల్లల పెళ్లిళ్ల, చదువుల నిమిత్తం భూములు ఉపయోగపడడంలేదని రైతులు గతంలో పవన్‌కల్యాణ్‌కు నివేదించారు. దీంతో మేలు జరిగేలా చూస్తానని అప్పట్లో రైతులకు హామీ ఇచ్చారు. ఈ సమస్యను ఇటీవల శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వ విప్ గిడుగు హరిప్రసాద్ కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్య మరోసారి చర్చనీయాంశమైంది. మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వం కాకినాడ సెజ్ రైతులకు స్టాంప్, రిజిస్ట్రేషన్ డ్యూటీని మినహాయించి తిరిగి రైతుల భూములు వారికి తిరిగి రిజిస్ట్రేషన్ చేసేలా ఆదేశాలిచ్చింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

భూముల బదిలీకి ఫీజుల్లేవు

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ)/కొత్తపల్లి, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్‌ఈజెడ్ భూములను రైతుల పేరున బదిలీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇచ్చిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం తెలిపారు. ఈ మినహాయింపు 1899 స్టాంపు చట్టం సెక్షన్9 (1)(ఏ), 1908 రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 78 ప్రకారం అమలుచేస్తారని ప్రభుత్వం తెలిపిందన్నారు. ఈ మినహాయింపు రైతుల భూమి బదిలీలకు మాత్రమే వర్తిస్తుంది.

పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం

కొత్తపల్లి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): సెజ్ భూములు తిరిగి రైతులకే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని అధికారిక ప్రకటన వెలువడంపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్ ఫ్లెక్సీలకు ముమ్మిడివారిపాడు, రావివారిపోడు గ్రామాలతోపాటు పొన్నాడ శివారు మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద సెజ్ రైతులు పాలాభిషేకాలు చేశారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, తెలగంశెట్టి శ్రీనివాసరావు, పిల్లా శివశంకర్, బాపన్నదొర పాల్గొన్నారు.



ధాన్యం కమీషన్
పెండింగ్



- పీఏసీఎస్‌లకు రావాల్సిన కమీషన్ రూ.46.60 కోట్లు
- పౌరసరఫరాలశాఖ నుంచి ఎనిమిదేళ్లుగా విడుదల కాని వైనం
- ప్రతిపాదనలు పంపినా స్పందన నిల్
- పీఏసీఎస్‌ల కార్యవర్గాల గగ్గోలు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎనిమిదేళ్లుగా పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమిషన్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు విడుదల కాలేదు. దీంతో ఆయా సంఘాల అధ్యక్షులు, కార్యవర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. జిల్లాలో 72 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు) ఉన్నాయి. ఇవి నిత్యం రైతులకు స్వల్పకాలిక పంట రుణాలు ఇవ్వడం, ఎరువులు వంటి వ్యవసాయ ఉత్పత్తులను అందిస్తాయి. సహకార సంఘాల చట్టం ప్రకారం రైతులకు సహకారం అందిస్తాయి. దీనిలో భాగంగానే ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తున్నారు.ఈ ప్రక్రియ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ నేపథ్యంలో క్వింటా ధాన్యం సేకరణకుగాను 31.25పైసల చొప్పున పీఏసీఎస్‌లకు ఏపీ పౌరసరఫరాలశాఖ కమీషన్ రూపంలో ఇవ్వాల్సి ఉంది. ఇలా 2017 నుంచి 2025 వరకు అంటే ఎనిమిదేళ్లపాటు కమీషన్ విడుదల కాలేదు. ఇలా రూ.46కోట్ల60లక్షల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో పీఏసీఎస్‌ల ఆర్థిక పరిపుష్టి జరగడంలేదు. ఏళ్ల తరబడి పీఏసీఎస్‌లకు రావాల్సిన కమీషన్లు పేరుకుపోతే ఎలా అని పీఏసీఎస్‌ల అధ్యక్షులు ప్రశ్నిస్తున్నారు. తమకు రావాల్సిన కమీషన్ ఇవ్వాలని పలుమార్లు ఏపీ పౌరసరఫరాలశాఖ అధికారులతోపాటు మంత్రులకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపినా స్పందనలేదని వారు వాపోతున్నారు.

రబీలో విడుదల కాని జీతాలు

గత రబీసీజన్‌లో 269 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పీఏసీఎస్ సిబ్బంది 800మంది టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఆపరేటర్లు, హెల్పర్లుగా పనిచేశారు. వీరికి ఇప్పటివరకు ప్రభుత్వం జీతాలు విడుదల చేయలేదు.జీతాల రూపంలో రూ.కోటి67లక్షలు విడుదల చేయాల్సి ఉండడంతో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రబీ సీజన్‌లో విధులు నిర్వహించిన వాటికి ఇప్పటివరకు నిధులు విడుదల చేయకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

బకాయిలు విడుదల చేయాలని కోరాం

-జిల్లా సహకార అధికారి శ్రీనివాసురెడ్డి

2017 నుంచి 2025 వరకు ధాన్యం సేకరణలోభాగంగా పీఏసీఎస్‌కు రావాల్సిన బకాయిలు మొత్తం విడుదల చేయాలని ఏపీ పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులకు అనేక పర్యాయాలు ప్రతిపాదనలు పంపాం. సిబ్బందికి రావాల్సిన జీతాల బకాయిలను కూడా అడుగుతున్నాం. ఇప్పటివరకు వాటిని పౌరసరఫరాలశాఖ విడుదల చేయలేదు. దీనిపైన ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తున్నాం.

ప్రతినెలా మూడో శుక్రవారం
ఉద్యోగుల పీజీఆర్ఎస్

- సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సూచనల ప్రకారం ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 17న ఉద్యోగుల పీజీఆర్ఎస్ కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని, ఉద్యోగులందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యుత్ కార్మికుల సంఘంతో చర్చలు విఫలం

- నేటి నుంచి సమ్మెలోకి కార్మికులు



సామర్లకోట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికులు,అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంపై మంగళవారం రాత్రి వరకూ ప్రభుత్వ ప్రతినిధులతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ముందుగా ప్రకటించిన రీతిలోనే బుధవారం ఉదయం 6గంటల నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు రాష్ట్ర కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుల సంఘ జిల్లా చైర్మన్ వీసం వీరనాగు మంగళవారంరాత్రి వెల్లడించారు. విద్యుత్‌సంస్థలో డిస్కం, ట్రాన్స్‌కో విభాగాల్లో పనిచేస్తున్నవారు, 400కేవీఏ, 220 కేవీఏ, 132కేవీఏ హైటెన్షన్ సబ్‌స్టేషన్‌ల్లో పని చేస్తున్న 400మంది కార్మికులు సమ్మెబాట పడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ ప్రధానకార్యదర్శి వి.ప్రేమ్‌కుమార్, ఎ.సుదర్శన్ ఆదేశాల మేరకు జిల్లాలో 400మంది కార్మికులు సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ముందుగా నైట్ డ్యూటీ సిబ్బంది సబ్‌స్టేషన్‌ల్లో షిఫ్ట్ ఆపరేటర్లు ఉదయం 6గంటలనుంచి సంబంధిత సెక్షన్,డ్యూటీలను అప్పగించి సమ్మెలోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల పైబడి వ్యవస్థలో పనిచేస్తున్న కార్మికులకు ఏమైనా, కోట్ల రూపాయల సూపర్వైజర్ చార్జీల దోపిడీ, బానిస బతుకులు లేకుండా నేరుగా వేతనాలు ఇచ్చేంతవరకూ ఈ సమ్మె విరమించేదిలేదని కార్మికులు ఐక్యంగా నిర్ణయించుకున్నామని వీరనాగు అన్నారు.

జిల్లాలో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు లేవు

- జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిణి కృష్ణకుమారి

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎక్కడా కూడా నకిలీ మద్యం తయారీ కేంద్రాలు లేవని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిణి కృష్ణకుమారి తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన వెలువరించారు. జిల్లాలో ఏడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఈఎస్ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు నిత్యం తనిఖీలు చేయడంవల్ల ఎలాంటి నకిలీ మద్యం తయారీ కేంద్రాలు లేవన్నారు. అక్రమమద్యం, స్పిరిట్, ఇతర నకిలీ మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా, తయారీ చేయకుండా నిరంతరం నిఘా పెట్టామన్నారు. దీనిలో భాగంగానే జిల్లాలో 171 మద్యం దుకాణాలు, 9 బార్లలో మద్యం నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రజలు మద్యం బాటిళ్లు కొనుగోలు చేసినప్పుడు అనుమానాలు వస్తే ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. టోల్ ఫ్రీ నెంబరు 14405కు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. నకిలీ మద్యం అరికట్టాలని వైసీపీ నాయకులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఈ వివరణ ఇచ్చామన్నారు.

కమిషనర్లు ఏరీ?



- పిఠాపురం, గొల్లప్రోలుల్లో స్తంభించిన పాలన
- పురపాలనపై శ్రద్ధ పెట్టేదెవరు
- సెలవులో ప్రస్తుత కమిషనరు
- ఇన్‌చార్జిలకు పగ్గాలివ్వరు.. రెగ్యులర్ అధికారులను నియమించరు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పురపాలన అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటి వరకూ రెండు పట్టణాలకు ఒకే కమిషనరు ఉండగా, ఆయన సెలవులో వెళ్లడంతో పాలనకు నాథుడు కరువయ్యాడు. తాత్కాలికంగా డెలిగేట్ కమిషనరు బాధ్యతలు ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించినా వారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించకపోవడంతో పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో పాలనా వ్యవహారాలు స్తంభించాయి. ఏ పని ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. రెండుచోట్ల రెగ్యులర్ కమిషనర్లను నియమించి పాలన గాడిలో పెట్టాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

పిఠాపురం మునిసిపల్ కమిషనరుగా ఉన్న నామన కనకారావు అమెరికా వెళ్తున్న నేపథ్యంలో సెలవు పెట్టారు. ఈనెల 6నుంచి ఈ ఏడాది డిసెంబరు 31 వరకూ ఈయనకు సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కనకారావు గొల్లప్రోలు నగరపంచాయతీ ఇన్‌చార్జి కమిషనరుగా కూడా వ్యవహరిస్తున్నారు. ఈయన సెలవులో వెళ్లడంతో ప్రస్తుతం పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న రెండు పట్టణాల్లో పాలనా వ్యవహారాలు చూసే నాథుడు లేకుండా పోయారు.

తొమ్మిది నెలలుగా..

పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలకు ఇప్పటి వరకూ ఒకే కమిషనరు కొనసాగడంతో పురపాలన ఇప్పటికే కొంతమేర గాడి తప్పింది. గతంలో గొల్లప్రోలు కమిషనరుగా పనిచేసిన రవికుమార్ 2024, డిసెంబరు 31న పదవీ విరమణ చేసిన తర్వాత రెగ్యులర్ కమిషనరును నియమించలేదు. దీనితో పిఠాపురం కమిషనరు కనకారావుకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో రెండుచోట్ల పూర్తిస్థాయిలో పాలనపై దృష్టిపెట్టలేని పరిస్థితి నెలకొంది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో రెండు పట్టణాల్లో రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధికి భారీగా నిధులు విడుదలవుతున్నాయి. తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగుదలకు నిధులు కేటాయించారు. ఈ పనులన్నింటినీ పూర్తిస్థాయిలో పర్యవేక్షించడంతోపాటు పట్టణంలో అన్ని వ్యవహారాలను చక్కపెట్టాల్సి ఉంటుంది.

ముందుకు సాగని పాలన

కనకారావు సెలవుతో పిఠాపురం మునిసిపల్ కమిషనరుగా ఇన్‌చార్జి బాధ్యతలను డీఈఈ రాజు,గొల్లప్రోలు కమిషనరు బాధ్యతలను ఏఈ అలీషాకి అప్పగించారు.వీరికి తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించినా ఇంకా మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌నుంచి ఆదేశాలు రాకపోవడంతో పాలనా వ్యవహారాలు నిలిచిపోయాయి. ఎలాంటి సర్టిఫికెట్లను జారీ చేసే అవకాశం లేదు. డిజిటల్ సిగ్నేచర్ కీ వస్తేనే అన్నిరకాల ధ్రువీకరణలు జారీ చేసే వీలుంటుంది. 9రోజులుగా రెండు పట్టణాల్లో ఏ పని ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. అత్యవసర పనులు చేసే వీలు లేకుండా పోయింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతోపాటు వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రెగ్యులర్ కమిషనర్లను నియమిస్తారా

పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలకు రెగ్యులర్ కమిషనర్లు నియమించాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు. పిఠాపురం పురపాలక సంఘం, గొల్లప్రోలు నగర పంచాయతీలకు వేర్వేరుగా కమిషనర్లను నియమించేలా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. లేకుంటే పాలన పూర్తిగా గాడి తప్పుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

1040 మెట్రిక్ టన్నుల యూరియా రాక

- ఇఫ్కో ద్వారా 700 మెట్రిక్ టన్నులు
- స్పిక్ ద్వారా 340 మెట్రిక్ టన్నులు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాకు మరో 1040 మెట్రిక్ టన్నుల యూరియా సోమవారం వచ్చింది. రైల్వే ర్యాక్‌ల ద్వారా దీన్ని ద్వారపూడిలో నిల్వ చేశారు. దీనిలో ఇఫ్కో ద్వారా 700 మెట్రిక్ టన్నులు యూరియా, స్పిక్ సంస్థ ద్వారా 340 మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి అయింది. దీనిలో అవసరం మేరకు ఈ ఖరీఫ్‌లో రైతులకు పంపిణీ చేస్తారు. జిల్లాలో ఉన్న అన్ని పీఏసీఎస్‌లకు, రైతుసేవాకేంద్రాలకు, ప్రైవేటు ఎరువుల డీలర్లకు ఎరువులు సరఫరా చేస్తున్నారు. దీనిలో 250మెట్రిక్ టన్నులు, గతంలో మిగిలినఉన్న మరో 250 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తంగా 500మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ నిల్వలుగా వ్యవసాయశాఖ అధికారులు నిల్వచేస్తున్నారు. ప్రభుత్వ అధీనంలో ఉండే మార్క్‌ఫెడ్ గొడౌన్లలో వీటిని భద్రపరుస్తున్నారు. వచ్చే రబీసీజన్‌లో ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 23,300 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగించాల్సి ఉండగా 24,900 మెట్రిక్ టన్నులను రైతులు వినియోగించారు. అంటే 1600 మెట్రిక్ టన్నులను అదనంగా పొలాలకు చల్లారు. కొరత నేపథ్యంలో యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. దీంతో జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో యూరియా కోసం అగచాట్లు పడ్డారు. ఇప్పుడు తాజాగా మరోసారి 1040 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు ప్రభుత్వం కేటాయించడంతో బఫర్ నిల్వలు భారీగానే పెరిగాయి. ఈ నేపథ్యంలో కాకినాడ వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. 500 మెట్రిక్‌టన్నుల యూరియాను బఫర్ నిల్వలుగా ఉంచి రబీ సీజన్‌లో దీన్ని వినియోగించనున్నామన్నారు. ఖరీఫ్ సీజన్ చాలావరకు ముగిసిపోయిందన్నారు. గండేపల్లి మండలంలో వరికోతలు ప్రారంభమయ్యాయన్నారు. వచ్చేనెల మొదటివారంలో ఇతర మండలాల్లో వరికోతలు జరుగుతాయన్నారు. దీంతో ఎరువులను ఎక్కువగా రబీ సీజన్ కోసం బఫర్‌లో ఉంచుతున్నామన్నారు.

జిల్లాలో అధికారులు ఎంతో సహకరించారు



- వీడ్కోలు సభలో జేసీ రాహుల్ మీనా
- సత్కరించిన కలెక్టర్, ఎస్పీ

జేసీని సత్కరిస్తున్న ఎస్పీ, కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):తాను ఇంతకాలం పనిచేసిన ఈ జిల్లాలో అధికారులు, ఉద్యోగులు ఎంతో సహకరించారని జేసీ రాహుల్‌మీనా అన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం జేసీ వీడ్కోలు సభ నిర్వహించారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయిన ఆయన్ను ఘనంగా సత్కరించారు. కాకినాడ జిల్లాలో జేసీగా పనిచేయడం ఎంతో సంతృప్తి నిచ్చిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాకినాడలో పోర్టును పరిశీలించిన జిల్లా ఎస్పీ 7

కోడి పందాలు చూద్దామని తీసుకెళ్లి హత్య 7



అందెల రవమిది పదములదా!

లయబద్ధమైన సంగీతానికి అనుగుణంగా అవయవాలన్నింటినీ కదుపుతూ చేసే కూచిపూడి నృత్యాన్ని తిలకించేందుకు రెండు కళ్లూ చాలవు. కూచిపూడి నృత్యానికి, భరత నాట్యానికి పోలికలు ఉన్నప్పటికీ వేటికవే ప్రత్యేకత సంతరించుకున్నాయి. సంప్రదాయ కళాకారులు కూచిపూడి నృత్యానికి ఆధునిక హంగులు అద్దుతూ వేలాది మందికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. కృష్ణా జిల్లా కూచిపూడిలో పుట్టిన ఆ నృత్యానికి ఆ గ్రామం పేరు రావడం విశేషం. కూచిపూడి నృత్యానికి ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం తీసుకువచ్చిన ఘనత 'పద్మభూషణ్' డాక్టర్ వెంపటి చిన సత్యంకు దక్కుతుంది. ఆయన జయంతిని పురస్కరించుకుని ప్రతిఏటా అక్టోబరు 15వ తేదీని ప్రపంచ కూచిపూడి నృత్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ శాస్త్రీయ నృత్య రూపకాన్ని సాధన చేసేందుకు ఎందరో విద్యార్థులు ముందుకు వస్తున్నారు. వారికోసం పట్టణాల్లోనే కాదు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

నేడు అంతర్జాతీయ కూచిపూడి నృత్య దినోత్సవం

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లికి చెందిన నాగిరెడ్డి దుర్గాప్రసాద్ శ్రీరామాంజనేయం డ్యాన్స్ అకాడమీ ఏర్పాటుచేశారు. ఆయన వద్ద వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు కూచిపూడి నృత్యంలో తర్ఫీదు పొందారు. ఇటీవల రాజమహేంద్రవరం లాస్యప్రియ కూచిపూడి నృత్య నికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ ఫెస్టివల్‌లో దుర్గాప్రసాద్ శిష్యులు అద్భుత ప్రతిభ చాటారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శ్రీరామాంజనేయం అకాడమీ చోటు సాధించింది. కూచిపూడి నృత్యబాల పురస్కారాలు అందించారు. గురువు దుర్గాప్రసాద్ 'నాట్యకళాబ్రహ్మ' పురస్కారం అందుకున్నారు.

ప్రధాన దేవాలయాల్లో ప్రదర్శనలు...

శ్రీరామాంజనేయం డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో కూచిపూడి నృత్య కళా రూపకాలను ప్రదర్శించారు. తొలుత అయినవిల్లి సిద్ధివినాయకుని ఆలయంతో ప్రారంభించి... వాడపల్లి, అన్నవరం, అప్పనపల్లి, విజయవాడ దేవస్థానాల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖల ప్రశంసలు అందుకున్నారు. వినాయకచవితి, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో రాష్ట్రవ్యాప్తంగా 300కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. కళా కృషికి గాను గురువు దుర్గాప్రసాద్ వివిధ నృత్య సంస్థల నుంచి నృత్యశ్రీ, నాట్యశౌరి, నాట్య కళాబ్రహ్మ పురస్కారాలు అందుకున్నారు.


రాజమహేంద్రవరంలో జాతీయ స్థాయి పోటీల్లో పురస్కారాలు అందుకున్న అకాడమీ విద్యార్థులు

కూచిపూడి నృత్యంపై ఆసక్తి పెరుగుతోంది

నాగిరెడ్డి దుర్గాప్రసాద్, గురువు, ఇందుపల్లి



ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో కూచిపూడి నృత్యానికి అంతర్జాతీయంగా ఆదరణ పెరిగింది. నృత్యంపై ఆసక్తి కలిగిన చిన్నారులను 'నాట్య మయూరి'లుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నా. చదువులో ఏకాగ్రతకు, మానసిక వికాసానికి, ఉల్లాసానికి కూచిపూడి నృత్యం దోహదపడుతుంది. భామాకలాపంతో పాటు ఎన్నో నృత్యరీతుల్లో శిక్షణ ఇస్తున్నాం.


వసంత మండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, చైర్మన్, ఈవో దంపతులు


మలయప్ప అలంకరణలో గరుడ వాహనంపై స్వామివారు

దేవాదిదేవా... శ్రీవాసుదేవా

- మలయప్ప అలంకరణలో శ్రీవారు
- గరుడ వాహనంపై విహరించిన వేంకటేశ్వరస్వామి
- కనుల పండువగా అష్టదళ పాదపద్మారాధన
- వాడపల్లిలో ఐదో రోజుకు 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు



ఆత్రేయపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతు న్నాయి. ఐదో రోజైన మంగళవారం ఆలయంలోని వసంత మండపంలో ఉత్సవమూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సప్తకలశారా ధన, మహా స్నపనం, వసంతోత్సవంలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి పాదాల చెంత 108 బంగారు పుష్పాలతో అష్టదళ పాదపద్మారాధనను కనుల పండువగా నిర్వహించారు. తొలుత బండారు దంపతులు గజమాలతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామివారికి సమర్పించారు. సాయంత్రం హోమాలు, హనుమత్ మూలమంత్ర హవనం, అష్టోత్తర శత కలశారాధన, పంచశయ్యాధివాసము, ఏకాంత సేవ జరిపారు. రాత్రి మలయప్ప అలంకరణలో శ్రీవారు గరుడ వాహనంపై తీరువీధుల్లో విహరించారు. జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ దంపతులు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

మహిళల కోలాటం, నాగపూర్‌కు చెందిన బ్యాండ్ వాయిద్యాలు, ఉత్తరప్రదేశ్ కాశీకి చెందిన అఘోరాల విన్యాసాలు, తెలంగాణకు చెందిన బోనాలు, శక్తివేషాలు అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు వీటిని ఆసక్తిగా తిలకించారు.



డ్రమ్స్ కొట్టిన బండారు...

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి సన్నిధికి చేరుకున్నారు. వాడపల్లి ముఖ ద్వారం వద్ద అన్నవరం సత్యనారాయణస్వామి రథయాత్రను తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. డ్రమ్స్ కొట్టి స్టెప్పులు వేసి అందరినీ ఉత్సాహపరిచారు.



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు దంపతులు, ఆకట్టుకున్న అఘోరాల ప్రదర్శన

గెలుపు, ఓటములు సహజం

- నవంబరులో రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలు
- సెట్రాజ్ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ
- నన్నయ యూనివర్శిటీలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు


వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, డీడీ

దివాన్‌చెరువు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గెలుపు, ఓటమి సహజమని, పోటీల్లో పాల్గొనడమే ముఖ్యమని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీడీఎస్ రామకృష్ణ చెప్పారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2025ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, సెట్రాజ్ డీడీ రామకృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా ఉన్న ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు యువతను సెట్రాజ్ ద్వారా ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి యువజనోత్సవాలను నవంబరు నెలలో అమరావతిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాస్థాయి ఉత్సవాలు ఇప్పటివరకూ కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో జరిగాయని అన్నారు. మిగిలిన జిల్లాల్లో కూడా పూర్తయిన తర్వాత రాష్ట్రస్థాయి ఉత్సవాల తేదీలను నిర్ణయిస్తామన్నారు. జాతీయ స్థాయి యువజనోత్సవాలు వచ్చే ఏడాది జనవరి 10,11, 12 తేదీల్లో ఢిల్లీలో జరుగుతాయని చెప్పారు.

వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. కాగా ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఇన్నోవేషన్ ట్రాక్ సైన్స్ మేళా ప్రదర్శనలో వంగ అయ్యప్ప బృందం, జానపద నృత్యం (బృందం)లో ఎస్ఆర్ఎస్. గ్రూపు, జానపద గేయాలు (గ్రూపు)లో తాతరాజు గ్రూపు, ఉపన్యాసంలో విదూషీ శాండిల్య, కథ రాయడంలో బి.జ్ఞానరామ షర్మిల, పెయింటింగ్‌లో మహ్మద్ సమీర్, కవిత్వంలో జి.ధృవీత్ ప్రథమ స్థానాల్లో నిలిచారు. వీరంతా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి 944 మంది ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా సెట్రాజ్ సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు, న్యాయనిర్ణేతలు పాల్గొన్నారు.


జానపద నృత్యం ప్రదర్శిస్తున్న యువతులు

పీఎం-వీబీఆర్‌వై పథకంలో నమోదు కావాలి


కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ ప్రతినిధులు

కాకినాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం అందించే ప్రయోజనాలు పొందడానికి యజమానులందరినీ పీఎం-వీబీఆర్‌వై పథకం కింద నమోదు చేయాలని అదనపు సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పి.వీరభద్రస్వామి తెలిపారు. కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్‌లో పీఎం-వీబీఆర్‌వైపై ఈపీఎఫ్ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి మాట్లాడుతూ పీఎం-వీబీఆర్‌వై పథకం లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించారు. ఉపాధి ఉత్పత్తిని ప్రోత్సహించడంలో, శ్రామికశక్తికి సామాజిక భద్రత కవరేజీని విస్తరించడంలో దాని పాత్రను వివరించారు. ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు కలువాయి కూడా పథకం ప్రయోజనాలను వెల్లడించారు. ఆర్థిక, సామాజిక శ్రేయస్సును నిర్ధారించడానికి చొరవను ఉత్తమంగా ఉపయోగించుకోవాలని యజమానులు, కార్మికులను కోరారు. కార్యక్రమంలో కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.మురళీధర్, జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శిరీషా తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రాజేష్ కుమార్, కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్, హెచ్ఆర్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు, రేపు 'నన్నయ'లో ఆహార మహోత్సవ ప్రదర్శన

దివాన్‌చెరువు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫుడ్, సైన్స్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 15,16 తేదీల్లో ఆహార మహోత్సవ ప్రదర్శన జరుగుతుందని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్యానర్‌ను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. అలాగే అకడమిక్ ఈవెంట్స్‌ను ప్రారంభించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆసక్తి గల వారు వంటలు సిద్ధం చేసుకుని విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్రదర్శించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, విభాగాధిపతి డి.కళ్యాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్లుకు ఐదవ విడత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలియజేశారు. ప్రవేశానికి iti.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఈనెల 16వ తేదీ సాయంత్రం 2గంటల్లోపు అభ్యర్థి ఏ కళాశాలలో చేరాలో ఆ ఐటీఐలను తప్పనిసరిగా ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంపిక చేసుకోవాలన్నారు. మొదటి, రెండవ, మూడవ, నాల్గవ విడతల్లో ఐటీఐ సీట్లు రాని అభ్యర్థులు కూడా తప్పనిసరిగా ప్రవేశానికి ఐదవ విడతలో మరలా కొత్త రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులంతా దగ్గరలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో ఈనెల 16వ తేదీ సాయంత్రం 4గంటల్లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని లేకుంటే కౌన్సెలింగ్‌కు అర్హులు కాదని వేణుగోపాలవర్మ తెలిపారు. మరిన్ని వివరాలకు 0884 2348182, 94404 08182 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఈ నెల 17వ తేదీ ఉదయం 8గంటల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి కౌన్సిలింగ్ ఉంటుందన్నారు.

భారతదేశ విజ్ఞానమే అన్నింటికీ మూలం

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
- రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు


సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక శాస్త్ర, సాంకేతికతకు భారతదేశ విజ్ఞానమే మూలం అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో 'ప్రాచీన భారత జ్ఞాన పునరుజ్జీవనం-ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఒక నిధి' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు తొలిరోజు మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానానికి ప్రాచీనకాలంలో భారతదేశ విజ్ఞానమే ఒక పునాదిగా నిలిచిందని, విద్యార్థులు, అధ్యాపకులకు మన సంస్కృతి, వారసత్వం పట్ల అవగాహన పెంపొందించడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం మాట్లాడుతూ మన పురాతన భారతీయ జ్ఞాన సంపద గత వైభవం మాత్రమే కాదని, నేటి ప్రపంచ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అందించగల శక్తివంతమైన సాధనమని అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్కియాలజీ రిటైర్డు ప్రొఫెసర్ డి.భాస్కర మూర్తి మాట్లాడుతూ వేదం, ఉపనిషత్తు యోగం, వాస్తు, వ్యవసాయం, గణితం, ఖగోళ శాస్త్రాలన్నీ మన పూర్వీకులు సాధించిన అసాధారణ విజయాలని అన్నారు. ప్రసిద్ధ నాటకకర్త వాడ్రేవు సుందరరావు మాట్లాడుతూ భారతీయ నాటక రంగం ప్రపంచానికి తలమానికమైనదని అన్నారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ జేడీ చప్పిడి కృష్ణ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సదస్సులో చీమలమర్రి శ్రీనివాస శర్మ, డి.కిరణ్‌కాంత్ చౌదరి, పసుమర్తి శ్రీనివాస్ శర్మ, సి.స్వరూపరాణి తదితరులు పరిశోధనాత్మక పత్రాలను చదివి వినిపించారు. సదస్సుకు 225 మంది తమ గోష్టిపత్రాలను పంపించారని కో-కన్వీనర్ వై.స్వర్ణశ్రీ తెలిపారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతులమీదుగా సావనీర్ ఆవిష్కరించారు. సదస్సులో పది మంది విదేశీ విద్యార్థులు జింబాబ్వే, జాంబియా, సౌత్ ఆఫ్రికా, కంబోడియా నుంచి పాల్గొన్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

జాతీయ తైక్వాండో పోటీలకు హరిప్రియ ఎంపిక



అంబాజీపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కుడుపూడి కావ్యసుందరి హరిప్రియ మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు సాయిరామ్, పీడీలు కుంపట్ల ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ నెల 10 నుంచి 12 వరకూ బాపట్ల జిల్లా పేటేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ పోటీల్లో 20 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచిందని, పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. విద్యార్థినిని పీఈటీ అందె సూర్యకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర బాక్సింగ్ పోటీల్లో శివకోడు విద్యార్థులకు పతకాలు




రాజోలు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో శివకోడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. అండర్-14 విభాగంలో కానూరి శివచరణ్, అండర్-17 విభాగంలో పాలపర్తి విజయ్‌కుమార్ కాంస్య పతకాలు సాధించాడని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలను సాధించిన క్రీడాకారులను సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, పీఎంసీ చైర్మన్ అప్పారి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, బాక్సింగ్ కోచ్ బొంతు మధుకుమార్ అభినందించారు.

పంచారామ క్షేత్రాల దర్శనానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా పంచారామ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజరు ఎంయూవీ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపోలో ఆన్‌లైన్ రిజర్వేషన్ కూడా ప్రారంభించనున్నట్టు తెలిపారు. పంచారామ క్షేత్రాల స్పెషల్స్ ఈ నెల 25, 26, నవంబరు 1, 2, 8, 9, 15, 16 తేదీల్లో ప్రతి శనివారం, ఆదివారం కాకినాడలో రాత్రి 8 గంటలకు బయల్దేరి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోట దర్శనాలు పూర్తయిన తర్వాత మరుసటి రోజు రాత్రి 8 గంటలకు కాకినాడ చేరతాయని చెప్పారు. టిక్కెట్లు కావాల్సిన వారు ఆర్టీసీ ఆథరైజ్డ్ ఏజెంట్ల వద్ద (లేదా) ఆర్టీసీ వెబ్‌సైట్ www.apsrtconline.inలో తీసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 99592 25564, 73829 10869, 73829 10569, 73829 10658, 94928 33885 నెంబర్లను సంప్రదించాలన్నారు.

డొంకరాయి నుంచి దిగువకు 10,000 క్యూసెక్కులు


జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

మోతుగూడెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి దిగువకు 10,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు జెన్‌కో అధికారులు మంగళవారం తెలిపారు. డొంకరాయి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1037 అడుగులు కాగా అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా డొంకరాయి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవారం నాటికి 1036.50 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. దీంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమై జలాశయ నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరుకోకుండా 1036.50అడుగుల వద్ద స్థిరంగా నీటి మట్టం కొనసాగేలా జలాశయం నుంచి ఆరో నెంబర్ గేటు ద్వారా 0.84 అడుగుల ఎత్తి దిగువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం డొంకరాయి పవర్ కెనాల్ ద్వారా మరో 4000 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయానికి 5000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోందని పేర్కొన్నారు.

యానాం.. జలమయం!

ఎడతెరిపిలేని భారీ వర్షం

నీట మునిగిన రోడ్లు

పిడుగుపాటుకు సిమెంట్ పిల్లర్ ధ్వంసం



జలమయమైన ఓ రోడ్డు



నీట మునిగిన పిల్లారాయస్వామి ఆలయం

యానాం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): యానాంలో మంగళవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో 3 గంటలు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు విపరీతంగా వీయడంతో పలుచోట్ల వృక్షాలు నేల కొరిగాయి. యానాంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు క్రీడా ప్రాంగణాలు చెరువులను తలపించాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలో వర్షంనీరు నిలిచిపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పిల్లారాయస్వామి ఆలయం, పోలీస్‌స్టేషన్ సముదాయాలు నీటమునిగాయి. ప్రధానంగా అన్ని రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. కురసాంపేట గ్రామంలో కొబ్బరి చెట్టుపై, అలాగే గుండాబత్తుల సూర్యనారాయణ ఇంటిపై పిడుగు పడడంతో మూడు అడుగులున్న కాంక్రీట్ పిల్లర్ పగిలిపోయి చెల్లాచెదురైంది. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సంఘటనతో నాలుగు టీవీలు, ఎనిమిది సీలింగ్ ఫ్యాన్లు కాలిపోయినట్టు బాధితులు తెలిపారు.



కళాశాలకు వెళ్లే విద్యార్థుల ఇక్కట్లు



యానాంలో చెరువును తలపిస్తున్న జూనియర్ కళాశాల ప్రాంగణం

వేదాలు, వేదపండితులకు ఎల్లప్పుడు గౌరవం

- వేదసభలో పాల్గొని తన్మయత్వం పొందా
- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ
- కోనసీమ జిల్లా నందంపూడిలో వేద సభ





నందంపూడిలో రమణకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు, సభలో పాల్గొన్న రమణ

అంబాజీపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేదాలు, వేదపండితులకు ఎల్లప్పుడు మంచి గుర్తింపు, గౌరవం ఉంటుందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం నందంపూడిలో వద్లమాని లక్ష్మీనారాయణ అవధాని స్మృతియుర్థం ఆయన కుమారుడు సుబ్రహ్మణ్య ఘనపాటి ఆధ్వర్యంలో వద్లమాని లక్ష్మీనారాయణ మెమోరియల్ ట్రస్టు పేరిట వేద సభ మంగళవారం నిర్వహించారు. సభకు మహా మహోపాధ్యాయ శాస్త్ర నిధి విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వేదసభలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వేద సభలు నిర్వహిస్తే వేదాల ప్రాశస్త్యాన్ని విశ్వవ్యాప్తంగా చాటి చెప్పడంతో పాటు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లని.. దక్షిణ భారతదేశంలోని కోనసీమ ప్రాంతం వేద పండితులకు పుట్టిలన్నారు. నాకు చిన్నప్పటి నుంచి వేదసభలో పాల్గొనాలనే కోరిక ఉండేదని, తాను నందంపూడి వేదసభలో పాల్గొని వేదఘోషను ఆస్వాదించడంతో చిన్ననాటి కోరిక నెరవేరిందని రమణ తెలిపారు. వేదసభలో పాల్గొని తన్మయత్వం పొందానన్నారు. తొలుత నందంపూడి చేరుకున్న ఆయనకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అలాగే వద్లమాని లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో రమణ కుటుంబసభ్యులు కొద్దిసేపు మాట్లాడారు. తాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో తిరుపతిలో తనతో సుబ్రహ్మణ్యఘనాపాటి తీయించుకున్న ఫొటోలను చూసి ఆనందంపొందారు. వేంకటేశ్వర స్వామి దయ వల్ల తాను ఆ పదవిలో ఎంతో సమర్థవంతంగా పనిచేశానన్నారు. కార్యక్రమం అనంతరం వద్లమాని సుబ్రహ్మణ్య అవధాని మనువడు ప్రముఖ వేదపండితులు ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్య రవితేజ ఘనాపాటికి జస్టిస్ రమణ సింహతలాటాన్ని అలకరించి సత్కరించారు. లక్ష్మీనారాయణ అవధాని మెమోరియల్ ట్రస్టుకు రూ.2లక్ష చెక్కును విరాళంగా అందించారు. జస్టిస్ రమణకు తహశీల్దార్ చినబాబు, సీఐ రుద్రరాజు భీమరాజు మొక్కలను అందించి ఘనస్వాగతం పలికారు. బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పీకే రావు, టీటీడీ బోర్డు మాజీ డైరక్టర్ డొక్కా నాథ్‌బాబు, ఎంపీటీసీ వద్లమాని పద్మావతి, పితాని వీరాస్వామి, అరిగెల బలరామమూర్తి, వేదపండితులు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానంలో శాంతిహోమం



హోమక్రతువు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం అన్నవరం దేవస్థానంలో చేపట్టిన శాంతిహోమం మంగళవారం కొనసాగింది. పండితులు మన్యుసూక్తపారాయణ, చండీ పారాయణ, శ్రీ మత్‌త్రిపాద్విభూతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, వైదిక కార్యక్రమాలు ముగియనున్నాయి.

ఏం సమాచారమొచ్చిందో..!

కాకినాడ సీ, యాంకరేజ్ పోర్టులను ఆకస్మికంగా పరిశీలించిన ఎస్పీ



కాకినాడ సీ పోర్టులో ఎస్పీ బిందుమాధవ్



పోర్టులో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

కాకినాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సీ పోర్టు, యాంకరేజ్ పోర్టులను కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి భద్రతా వ్యవస్థలను పరిశీలించారు. పోర్టు నిర్వహణలో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులలో పొందుపరిచిన విషయాలను క్షుణ్ణంగా గమనించారు. పీఆర్‌వో సబ్ ఇన్‌స్పెక్టర్ పి.పవన్‌కుమార్, ఏపీ ఆర్వో సిబ్బందికి తగు మార్గదర్శకాలు ఇచ్చారు. అలాగే పోర్టు పరిధిలోని చెక్‌పోస్టుల పనితీరుపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందిని కలిసి భద్రతా అంశాలపై దృష్టి సారించారు. చెక్‌పోస్టు సిబ్బందికి భద్రత, విజిలెన్స్, రికార్డ్ మేనేజ్‌మెంట్ సంబంధిత అంశాలపై స్పష్టమైన సూచనలు అందించారు. కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ కెప్టెన్ జాకబ్ సత్యరాజు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు, సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యనారాయణ తదితరులు పోర్టులో భద్రతా చర్యలపై వివరాలు సమర్పించారు. పోర్టు భద్రతను మరింత బలోపేతం చేయడానికి సాంకేతిక పరికరాలు సీసీ టీవీ పర్యవేక్షణ, అలర్ట్ రెస్పాన్స్ సిస్టమ్‌ను మరింత సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. భద్రతా చర్యల్లో ఎటువంటి అలసత్వం ఉండకూడదని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆకస్మిక పర్యటనతో అక్కడ పోర్టు అధికారులు అలర్ట్ అయ్యారు. భద్రతను ముమ్మరం చేశారు. ఏదైనా ఉపద్రవం ఏమైనా తలెత్తే అవకాశం ఉందా? అన్నట్టుగా కంగారు పడ్డారు. ఇది సాధారణ తనిఖీనా లేక ఏమైనా సమాచారం వచ్చిందా? అని ఆశ్చర్యపోయారు. మరోవైపు బిందుమాధవ్ కూడా ఈ మధ్య కాలంలో ఇలా పోర్టులో ఆకస్మిక పర్యటనలు చేసిన దాఖలాలు లేవు. మొత్తానికి ఆయన పర్యటన వెనుక అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తీర ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేసేందుకే ఆయన పర్యటన చేశారా? మరే ఇతర కారణమేదైనా ఉందా? అనేది అంతుచిక్కడం లేదు.

మల్లాంలో గ్యాస్‌లీక్

చెలరేగిన మంటలు

ముగ్గురికి తీవ్రగాయాలు



మల్లాంలో గాయపడిన వ్యక్తి

పిఠాపురం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాంలో మంగళవారం రాత్రి గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామంలోని మల్లెపాముల వీర నాగేశ్వరరావు ఇంటిలో వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు, అతడి భార్య నాగలక్ష్మి, అన్నయ్యతో మాట్లాడేందుకు వచ్చిన తమ్ముడు లోవరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి ఏడుస్తున్నాడని బయటకు రావడంతో నాగేశ్వరరావు ఇద్దరి పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏటిమెరక ఓఎన్జీసీ సైట్‌లో గ్యాస్ లీక్

ఉప్పలగుప్తం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం పంచాయతీ ఏటిమెరక ఓఎన్జీసీ సైట్‌లో మంగళవారం గ్యాస్‌లీకేజీతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గ్యాస్ పైప్‌లైన్‌లో ఏర్పడిన లీకేజీని ఓఎన్జీసీ టెక్నికల్ సిబ్బంది సరిచేశారు. కొద్దిసేపటికి పైప్‌లైన్ ప్రదేశంలో నీటిబుడగలు ఎగదన్నడంతో స్థానిక పెద్దలు ఓఎన్జీసీ అధికారులకు సమాచారమందించారు. పైప్‌లైన్ ఎప్పుడు పగిలి గ్యాస్ ఎగదన్నుతుందోనని పరిసరప్రాంతాల మహిళలు ఆందోళనచెందుతున్నారు.

ప్రజలపై కొండముచ్చు దాడి

మాగాంలో బంధించిన అటవీశాఖాధికారులు



కొండముచ్చును బంధించిన అధికారులు



అయినవిల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం మాగాం గ్రామంలో గత కొన్నిరోజులుగా ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్న కొండముచ్చును అటవీశాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గత ఆరు నెలల నుంచి మాగాం గ్రామంలో కొండముచ్చు నివసిస్తుంది. గ్రామస్తులు దానికి ఆహారం పెడుతున్నారు. గత రెండు రోజుల నుంచి ఒంటరిగా ఉన్న వ్యక్తులపై కొండముచ్చు దాడి చేసి గాయపరుస్తుంది. ఐదుగురు కొండముచ్చు దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్తులు స్థానిక పంచాయతీ అధికారులు, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం అటవీశాఖ అధికారులు కొండముచ్చును బోనులో బంధించారు. అటవీ ప్రాంతంలో వదిలి వేస్తామని వారు తెలిపారు.

కోడి పందాలు చూద్దామని తీసుకెళ్లి హత్య

- నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన పెద్దాపురం డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

ఏలేశ్వరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడిని ఏలేశ్వరం పోలీసులు పట్టుకున్నారని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. మంగళవారం ఏలేశ్వరంలో విలేకర్లకు ఈ వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో బొదిరెడ్డి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఈనెల 2న అదృశ్యమవ్వడంతో అతడి కుమారుడు ఆంజనేయులు 4న ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ సూచనల మేరకు వెంకటేశ్వర్లు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న ఏలేశ్వరానికి చెందిన రాజా రమేష్ అడ్డతీగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. చికిత్స అనంతరం కోలుకున్న అతడిని సోమవారం అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణ చేపట్టగా తానే వెంకటేశ్వర్లును హత్య చేసినట్టు రమేష్ ఒప్పుకున్నాడని డీఎస్పీ తెలిపారు. వారిద్దరికి కోడి పందాల్లో పరిచయం ఉంది. ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయి. ఈ క్రమంలోనే కోడి పందాలు చూద్దామనే సాకుతో వెంకటేశ్వర్లును రాజా రమేష్ కారులో తీసుకెళ్లి కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చాడు. అపస్మారకస్థితికి వెళ్లిన వెంకటేశ్వర్లను హత్య చేసి ఏజెన్సీ ప్రాంతం కొయ్యూరు సమీపంలోని బోదరాళ్ల ఘూట్ వద్ద తుప్పల్లో పడేసి వచ్చాడు. రాజా రమేష్ వెంకటేశ్వర్లు వద్ద రూ.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చమని ఒత్తిడి తేవడంతో అప్పు తీర్చే దారిలేక వెంకటేశ్వర్లను రాజా రమేష్ హత్య చేసినట్టు విచారణలో వెల్లడించాడని డీఎస్పీ పేర్కొన్నారు. వెంకటేశర్లు ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను తీసి ఏలేశ్వరంలో ప్రయివేటు బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.3.5 లక్షలు తీసుకున్నాడని డీఎస్పీ తెలిపారు. రాజా రమేష్‌ను అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టుకు తరలించినట్టు తెలిపారు. కేసును చేధించడంలో ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావు,సిబ్బంది కృషిని ఎస్పీ అభినందించారు.

ఉద్యోగాల పేరుతో రూ.లక్షల్లో మోసం

కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో

ఇద్దరిపై కేసు

కోటనందూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో బొద్దవరం గ్రామానికి చెందిన మళ్ల మల్లేశ్వరరావు, తునికి చెందిన కసిరెడ్డి దుర్గారత్నం కేంద్రప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి సుమారు రూ.25లక్షలు వసూలు చేసి నకిలీ అపాయిమెంట్‌లెటర్‌లు ఇచ్చి చాలామందిని మోసం చేశారు. అందులో బొద్దవరం గ్రామానికి చెందిన గెడ్డం ప్రేమ్‌కుమార్ నుంచి రూ.2.80 లక్షలు, ఎస్అర్‌పేట గ్రామానికి చెందిన రొట్టెల రాజు నుంచి రూ.3.80 లక్షలు, నాతవరం మండలం ఎస్‌బి పట్నం గ్రామానికి చెందిన పొట్నూరి శివకుమా ర్ నుంచి రూ.4.30 లక్షలతో పాటు పలువురి నుంచి భారీగా వసూలు చేశారు. బాధితుల ఫిర్యాదుతో మల్లేశ్వరరావు, దుర్గారత్నంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

14 రోజుల రిమాండ్ విధింపు

కె.గంగవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం పామర్రు గ్రామంలో దొంగతనం చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్.కె.జానీబాషా తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పామర్రులోని దేవ రపల్లి సత్యవతి ఇంట్లో ఎవరూ లేని సమ యంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించి బంగారు ఉంగరం, ఇత్తడి సామన్లు చోరీ చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి తాళ్లపొలం గ్రామానికి చెందిన పప్పుల ప్రభుకుమార్ (22), ద్రాక్షారామం గ్రామానికి చెందిన కోడూరి వెంకటేష్‌ను నిందితులుగా గుర్తించారు. వారిని మంగళవారం రామచంద్రపురం మండలంలోని తాళ్లపొలం గ్రామ పరిధిలోని తాళ్లపొలం గృహకల్ప అపార్ట్‌మెంట్స్ వద్ద అరెస్టు చేశారు. రామచంద్రపురం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు. వారి నుంచి దొంగతనం చేసిన సొత్తు బంగారు ఉంగరం, ఇత్తడి బిందె (రూ.38,000), కరప పోలిస్టేషన్ పరిధిలో అరట్లకట్ట గ్రామంలో చోరీకి సంబంధించిన 12 గ్రాముల బంగారు గొలుసు (రూ.36,000)ను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

బావమరిది చనిపోయాడని వెళ్తుండగా..

లారీని మోటార్‌సైకిల్ ఢీకొన్న

ఘటనలో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు



మరణించిన దొడ్డి నాగు



ఫైల్

దేవరపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): లారీని మోటార్‌సైకిల్ ఢీకొని వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... పోలవరం మండలం కొత్తపట్టి సీమ గ్రామానికి చెందిన దొడ్డి నాగు (35) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విజయవాడలో తన బావమరిది చనిపోయాడని కబురు రావడంతో కొత్తపట్టిసీమ నుంచి తూర్పుగోదావరి కొవ్వూరు మండలం దొమ్మేరు వచ్చాడు. తన మేనమామ కుమారుడు తాళ్ల అభిషేక్‌తో మోటార్ సైకిల్‌పై మంగళవారం ఉదయం విజయవాడకు పయనమయ్యారు. ఎదురుగా వెళ్తున్న క్వారీ లారీ యర్నగూడెం శివారు గండిచెరువు వద్ద మలుపు తిప్పుతుండగా వెనుక నుంచి వేగంగా మోటార్‌సైకిల్ దూసుకెళ్లి ఢీకొనడంతో దొడ్డి నాగు (35) అక్కడికక్కడే మృతి చెందాడు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన తాళ్ల అభిషేక్‌కు కాలు విరగడంతో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. మృతుడు నాగుకు భార్య సీత, కుమార్తె రచిత, కొడుకు చరణ్ ఉన్నారు. నాగు మృతదేహాన్ని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కూలీ పనులకు వెళ్తుండగా..

లారీ ఢీకొని మహిళ మృతి



లారీ టైర్ల మధ్యలో మృతదేహం

కడియం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడియపులకంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరితోటకు చెందిన కాదా గంగమ్మ (65) మరణించింది. పోలీసుల వివరాల ప్రకారం.. గంగమ్మ కడియపులంకలో కూలీ పనులకు మోటారుసైకిల్ లిఫ్ట్ అడిగి వెళ్తుండగా కడియపులంక వచ్చే సరికి పొట్టిలంక నుంచి కడియపులంక వైపు ఎదురుగా వస్తున్న లారీ గంగమ్మ ప్రయాణిస్తున్న మోటారుసైకిల్‌ను ఢీకొంది. దీంతో గంగమ్మ లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. మోటారుసైకిల్ నడుపుతున్న వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. గంగమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ ధనలక్ష్మి కేసు నమోదు చేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఒకదాత రూ.లక్ష యాభై ఒక్క రూపాయి విరాళం అంజేశారు. హైదరాబాద్‌కు చెందిన జి.శ్రీమన్నారాయణ లక్ష్మి దపంతులు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేక దర్శనం కల్పించారు.

ధర్మవరంలో చోరీ

రూ.18 లక్షల విలువైన

బంగారు, నగదు అపహరణ

ఆలస్యంగా వెలుగులోకి..

ప్రత్తిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో రూ.18లక్షల విలువైన బంగారు అభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. గ్రామంలోని సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్న పలివెల లక్ష్మీనారాయణ గృహంలో జరిగిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం... హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న తన కుమారుడు పలివెల సంతోష్ వద్దకు 10రోజుల కిందట లక్ష్మీనారాయణ దంపతులు ఇంటికి తాళం వేసి వెళ్లారు. 10 రోజుల పాటు కుమారుడు ఇంటి వద్ద గడిని మంగళవారం ధర్మవరం చేరుకున్న లక్ష్మీనారాయణ దంపతులు ఇంటి వద్ద తలుపుకు తాళం పగలకొట్టి దుండగులు చోరీకి పాల్పడినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గృహంలోని బీరువాలో భద్రపరిచిన బంగారు ఆభరణాలు, మరో రూ.2లక్షల నగదు, ఇతర వస్తువులు చోరీకి గురైనట్టు తెలిపారు. ఇటీవల గ్రామంలోనే హనుమాన్ కాలనీలో దుండగులు చొరబడి రూ.6లక్షలు విలువైన ఆభరణాలు దోచుకువెళ్లారు. ఇలా వరుసుగా గ్రామంలో దొంగతనాలు జరగడం పట్ల గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టివేత

గొల్లప్రోలులో 37.80 క్వింటాళ్లు స్వాధీనం

వాహనం సీజ్



గొల్లప్రోలులో స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం, వాహనంతో పోలీస్, సివిల్ సప్లైస్ అధికారులు

గొల్లప్రోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్‌బియ్యాన్ని అక్రమ మార్గాల్లో తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో గొల్లప్రోలు అడిషనల్ ఎస్ఐ లక్ష్మణరావు, ఏలేశ్వరం సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ వీఆర్‌కేవీ ప్రసాద్, రెవెన్యూ అధికారులు శనివారం సాయంత్రం గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులోని బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద తనిఖీలు చేపట్టారు. వ్యాన్‌లో రేషన్‌బియ్యాన్ని తరలిస్తుండగా గుర్తించారు. 80 బస్తాల్లో ఉన్న 37.80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ బి.ప్రత్తిపాడు గ్రామానికి చెందిన నందిపాటి వీరబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యాన్ని పిఠాపురం ఎంఎల్ ఎస్ పాయింట్‌కు అప్పగించారు. సివిల్ సప్లైస్ డీటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్ఐ తెలిపారు. కాగా తరలిస్తున్న వ్యాన్‌కు ఎటువంటి నెంబరు ప్లేట్లు లేకపోవడం గమనార్హం.

రాజవొమ్మంగిలో 1600 కిలోలు..

రాజవొమ్మంగి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి అక్రమంగా రవాణా అవుతున్న పీడీఎస్ బియ్యాన్ని రాజవొమ్మంగి తహశీల్దార్ అల్లు సత్యనారాయణ పట్టుకున్నారు. మండలంలోని లాగరాయి గ్రామం నుంచి కాకినాడ జిల్లాకు బియ్యం అక్రమ రవాణా అవుతుందనే సమాచారంతో తహశీల్దార్ సిబ్బందితో దాడి చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలానికి చెందిన కోరుకొండ అచ్చిరాజు తన వ్యాన్‌లో 1600 కిలోల పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేయడం గుర్తించి సీజ్ చేశారు. వ్యాన్‌ను పోలీసుస్టేషన్‌కు, బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు.

సీపీఆర్‌పై అవగాహన

పిఠాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెస్యూసిటేషన్)పై మంగళవారం అవగాహన, శిక్షణ నిర్వహించారు. గుండె లేదా శ్వాస ఆగిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని డాక్టర్ జయరాం వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రాథమిక సీపీఆర్ పద్ధతులు నేర్చుకోవాలని సూచించారు.



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న డీఈవో రమేష్, జిల్లా సైన్స్ అధికారి వినీల్

కౌశల్ క్విజ్ పోటీల గోడ పత్రికల ఆవిష్కరణ

కాకినాడ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కౌశల్ రాష్ట్ర స్థాయి ప్రతిభాన్వేషణ పోటీల్లో పాల్గొనాలని డీఈవో పిల్లి రమేష్ సూచించారు. భారతీయ విద్యా మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో నిర్వహించే క్విజ్ పోటీల గోడ పత్రికను మంగళవారం ఆయన తన చాంబర్లో ఆవిష్కరించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు తమ వివరాలను ఈ నెల 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నవంబరు 1, 2, 3 తేదీల్లో పాఠశాల స్థాయిలో నిర్వహించే పోటీల్లో తరగతికి ముగ్గురు చొప్పున మాత్రమే పాల్గొనాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబరు 27న తిరుపతిలో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్, కౌశల్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, సంయుక్త సమన్వయకర్త మోహన్, ఆపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చలపతి, శ్రీనివాస్, జిల్లా సమన్వయకర్త శివప్రసాద్ పాల్గొన్నారు.



పిఠాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

'సీఎం చంద్రబాబు విజన్‌తో అభివృద్ధి పరుగులు'

పిఠాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు దూరదృష్టి, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న తీరుతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 15ఏళ్లు పూర్తి చేసుకున్న బాబు నిరంతరం ప్రజల కోసమే ఆలోచిస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేశ్ కృషితో విశాఖపట్నంలో గూగుల్ 1గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ (ఏఐ హబ్) ఏర్పాటు కాబోతోందని చెప్పారు. రాష్ట్రానికి గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా పరిశ్రమలు వస్తున్నాయని, పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. టీడీపీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు బొజ్జా సతీష్, సకుమళ్ల గంగాధర్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ బర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు



సురేష్‌కుమార్‌ని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కేశవరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది

ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా సురేష్

పిఠాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పల్లా సురేష్ కుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన్ను కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ వి.కేశవరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



సాంస్కృతిక ప్రదర్శనల్లో విజేతలకు బహుమతులు అందజేసిన అతిథులు

కోకనాడ షాపింగ్ సంబరాల్లో అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పైడా చలమయ్య కల్యాణ మండపంలో మంగళవారం కోకనాడ షాపింగ్ సంబరాలు ఘనంగా జరిగాయి. గృహోపకరణాలు, ఎలక్ట్రికల్ వస్తువులు, చేనేత వస్త్రాలు వంటి వాటిపై తగ్గిన జీఎస్టీని శ్లాబులను వివరించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. బీజేపీ నాయకుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య, విశ్రాంత తహసీల్దారు గౌరినాయుడు, ఆర్డీవో కార్యాలయ సీసీ సుబ్బా రావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల హాస్టల్‌లో సమస్యల పరిశీలన

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులోని బాలుర కళాశాల వసతి గృహంలో సమస్యలు, అక్కడ ఉన్న పరిస్థితులపై అధికారులు పరిశీలన జరిపారు. కలెక్టర్ ఆదేశాలతో గొల్లప్రోలు ఎంపీడీవో సెలట్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ పెద్దిశెట్టి వేణుగోపాలకృష్ణ, ఈవోపీఆర్డీ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజులతో కూడిన బృందం మంగళవారం పరిశీలన జరి పారు. తాగునీటి శాంపిల్స్ సేకరించారు. టాయిలెట్లు నిర్మించాల్సిన అవసరం ఉందని, రెండు తాగునీటి ట్యాంకులు ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులు చదువుకునేందుకు అదనంగా లైటింగ్ సౌకర్యం కల్పించాలని గుర్తించారు. కళాశాల నుంచి బయటకు వచ్చే నీరు పోయేందుకు వీలుగా డ్రైన్ నిర్మించాలని, దోమల బెడద నివారణకు మెష్ డోర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పరిశీలనలో వెల్లడైంది.



చెందుర్తిలో జరిగిన రైతు శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీతా రామశర్మ

'మిరప పంటపై బ్లాక్ త్రిప్స్... అప్రమత్తంగా ఉండాలి'

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మిరప పంటపై కనిపిస్తున్న బ్లాక్ త్రిప్స్‌పై అప్రమత్తంగా ఉండి తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సీతారామశర్మ సూచించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి రైతు సేవా కేంద్రంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మిరప పంటలో కీటకాలు, వ్యాధుల నిర్వహణపై రైతులకు శిక్షణ ఇచ్చారు. జీవ ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. ఆయిల్ పామ్ విస్తరణ పథకాలు, బొప్పాయి, మామిడి, జీడిమామిడి, డ్రాగన్‌ఫ్రూట్ సాగు, హైబ్రిడ్ కాయగూరల సాగు గురించి ఉద్యానవనశాఖాధికారి వై.సోమరాజశేఖర్‌కు రైతులకు వివరించారు. ఉద్యానవన, వ్యవసాయ శాఖల సహాయకులు శివాజీ, శైలజ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ ఆపాలి... బాధ్యులపై చర్యలు చేపట్టాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరావు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లోని పెద్దాపురం డివిజన్ రామేశంపేట, ఆనూరు, కొండపల్లి గ్రామాల్లో అక్రమ మైనింగ్ (గనుల తవ్వకం) అరికట్టాలని, మైనింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు డిమాండ్ చేశారు. కాకినాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1976లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో సుమారు 900 ఎకరాల భూమిని దళితులకు ఇచ్చారన్నారు. 1983లో ఎన్టీఆర్, తర్వాత వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అక్కడ తగు సదుపాయాలు కల్పించారన్నారు. వారిని ప్రలోభాలకు గురిచేసి అక్రమంగా భూములు తీసుకుని మాఫియా మైనింగ్ చేస్తోందన్నారు. 2024లో అనుమతి ఇచ్చిన దానికంటే అదనంగా మైనింగ్ చేయగా కలెక్టర్ నాలుగు కోట్లు పైగా అపరాధ రుసుము విధించినట్టు తెలిపారు. ఇప్పటివరకు 600 ఎకరాలకు పైగా మైనింగ్ చేశారని, వాస్తవానికి 216 ఎకరాలకు మాత్రమే గనుల శాఖ నుంచి అనుమతి ఉందన్నారు. దానిని ఉల్లంఘించినా పట్టనట్టు వ్యవహరించడంతో తాము మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కొద్ది రోజులు నిలుపుదల చేసిన తర్వాత కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. తక్షణం చర్యలు చేపట్టి మైనింగ్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని కోరారు. జిల్లాలో అక్రమంగా మైనింగ్ చేస్తే అడ్డుకుంటామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కుండల సాయికుమార్, చోడిశెట్టి రమేష్, దాట్ల కృష్ణవర్మ, జ్యోతులరాజేష్ పాల్గొన్నారు.

రోడ్డెక్కిన కూరాడ డ్వాక్రా మహిళలు

సొమ్ములు స్వాహా చేసిన బ్యాంక్ కరస్పాండెంట్‌పై చర్యలకు డిమాండ్



కరప పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు

కరప, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తమ సొమ్ములు స్వాహా చేసిన బ్యాంక్ కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కూరాడ గ్రామానికి చెందిన పలువురు డ్వాక్రా మహిళలు మంగళవారం కరప పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలను అడ్డుకుని నిరసన తెలిపారు. అనంతరం వెలుగు ఏపీఎం ఎంఎస్ బాలాదేవితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలువురు డ్వాక్రా బాధితులు మాట్లాడుతూ గ్రామంలో 106 గ్రూపులుండగా వాటిలో 85 సంఘాలు ఎస్‌బీఐ అధికారులు స్థానికంగా ఏర్పాటుచేసిన బ్యాంక్ కరస్పాండెంట్ చిన్నం ప్రియభారతికి నెలవారీ రుణ వాయిదాలు చెల్లించారన్నారు. తమ రుణాలు ఎంతకీ తీరకపోవడంతో అనుమానం వచ్చి ఎస్‌బీఐ వేళంగి బ్రాంచిలో విచారించగా కట్టిన వాయిదాలను బ్యాంక్ ఖాతాకు జమచేయలేనట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. ఇలా 2023 నుంచి ఏకంగా రూ.99లక్షల మేర తమ సొమ్ములను స్థానిక యానిమేటర్ల సహాయంతో బ్యాంక్ కరస్పాండెంట్ ప్రియభారతి స్వాహా చేసిందని ఆరోపించారు. దీనిపై ఆమెను నిలదీయగా రాత్రికి రాత్రి ఇంటికి తాళాలు వేసుకుని పరారైందని వాపోయారు. దీనిపై గత నెల 24వ తేదీన కలెక్టరేట్ గ్రీవెన్స్‌లోను, ఈ నెల 7వ తేదీన డీఆర్డీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. తమకు జరిగిన అన్యాయంపై అధికారులు తక్షణం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే గురువారం వేళంగి ఎస్‌బీఐను ముట్టడించి సిబ్బందిని నిర్బంధిస్తామని అల్టిమేటం జారీ చేశారు. ఎంపీటీసీ గుత్తుల శాంతిబాలాజీ, జేఎస్పీ నాయకుడు వెలుగుబంట్ల గంగాధర్ తదితరులు బాధితుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

'మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలి'



పి.వెంకటాపురం ఆశ్రమ పాఠశాలలో ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు, మరుగుదొడ్ల శుభ్రతకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన కాకినాడ రూరల్ పి.వెంకటాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ ఆశ్రమ స్కూలు (ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్)ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూలు పరిసరాలు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఉపాధ్యాయుల విద్యా బోధన, స్కూల్లో లభిస్తున్న సౌకర్యాలు, సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ సీహెచ్ఎంజీ పరిమళకు సూచించారు. వసతిగృహాలకు మరమ్మతులు చేపట్టాలని ఉపాధ్యాయులు కోరగా ప్రతిపాదనలు తయారుచేసి ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్ అవార్డు స్వీకరించిన ప్రిన్సిపాల్‌ని అభినందించారు. ఎంపీడీవో వసుపులేటి సతీష్, తహసీల్దారు కుమారి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు సురేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల ఓబీ సమావేశం రసాభాస

సర్పవరం జంక్షన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ పి.వెంకటాపురం రామాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన గ్రామ సమాఖ్య ఓబీల సమావేశం రసాభాస అయ్యింది. వీఓఏ నియామకం, డ్వాక్రా సంఘాల సభ్యుల ఇన్సూరెన్స్‌పై నిర్వహించిన సమావేశంలో పాల్గొనేందుకు సీసీ రాంబాబు, తిమ్మాపురం యూనియన్ బ్యాంకు మేనేజరు విజయబాబు విచ్చేశారు. సమావేశం నిర్వహణ, అజెండాపై సభ్యులకు వివరించారు. వీవోఏ నియామకంపై సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. సభ్యుల రుణాల్లో అక్రమాలు జరిగాయని, లక్షలాది రూపాయలు తినేసినట్టు తనపై నిందలు వేశారని, ఈ ఆరోపణలు రుజువు చేయకుండా ఓబీల మీటింగ్‌పెట్టి వీవోఏ నియామకం చేపట్టడంపై సీసీని మాజీ వీవోఏ కనక మహాలక్ష్మి నిలదీశారు. ఆమెకు సంఘీభావంగా పలువురు సభ్యులు మాట్లాడటంతో సమావేశం రసాభాసగా మారడంతో ఎటువంటి తీర్మానం చేయకుండానే ముగిసింది. ముందుగా యూనియన్ బ్యాంకు తిమ్మాపురం బ్రాంచి మేనేజరు విజయబాబు మాట్లాడారు. డ్వాక్రా సభ్యులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, బ్యాంకుల సహకారంతో ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు.

వాసవి క్లబ్ అవార్డుల పండుగ

గొల్లప్రోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని కల్యాణ మండపంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వి-210 రీజియన్-2 జోన్ సోషల్, గ్రంధి వారి రీకాన్ అవార్డుల పండుగ మంగళవారం జరిగింది. వివిధ విభాగాల్లో అవార్డులు పొందిన వారిని సత్కరించారు. క్లబ్‌ల ప్రతినిధులు పేకేటి సర్వేశ్వరరావు, కమిడిచర్ల శంకర్, శ్రీకాంత్, వలివేటి ప్రసాద్, కుసుమించి పాపారావు, కేదారిశెట్టి సుశీలచలపతి, నానేపల్లి బంగారాజు, మామిడిపాక సతీష్, కంచర్ల బాబు, సమయమంతుల కృష్ణమోహన్, అద్దేపల్లి సత్తిరాజు, దంగేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు పొందిన వారికి సత్కారం



ఏటిమొగలో జీఎస్టీపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

జీఎస్టీ తగ్గింపు... అన్ని వర్గాలకు మేలు

కాకినాడ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజానీకానికి, నిర్మాణ రంగానికి మేలు చేసిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. మంగళవారం 14, 15, 16 డివిజన్లకు సంబంధించి ఏటిమొగలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. నాయకులు అరదాడి శివ, మల్లాడి చిన్న, మల్లాడి రాజు, కోనాడ ప్రకాష్, పినపోతు రాము, మల్లాడి ఏడుకొండలు, పాలెపు రాజు, పినపోతు జీవరత్నం, ఓలేటి పాండురంగుడు, బలసాడి శ్రీను, మల్లాడి గంగాధరం, కామాడి సుబ్బారావు, పట్టా ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్‌గా జీఎస్టీ ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, బీజేపీ ఇన్చార్జి వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం వారు మాధవపట్నంలో జీఎస్టీ అమలుపై విస్తృత ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు పెంకే వెంకటేష్, రామారావు, మునిరెడ్డి శ్రీరాములు, చీకట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటర్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

కాకినాడ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటర్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్ర బాబు సారథ్యంలో విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాకతో ఆంధ్ర డిజిటల్ హబ్‌గా మారుతుందన్నారు. విశాఖలో గూగుల్ సంస్థ రూ.87వేల కోట్ల పెట్టుబడులతో దక్షిణ ఆసియాలోనే రెండో అతి పెద్ద డేటా క్లస్టర్ ఏర్పాటు చేయబోతుందన్నారు. ఇది రాష్ట్ర అభివృద్ధిలో మైలురాయిగా మారుతుందన్నారు.

'దీపావళిని ఆనందంగా జరుపుకోవాలి'

తాళ్లరేవు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా దీపావళిని ప్రశాంతమైన వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం కోరింగలో దీపావళి నిబంధనలపై ఆటో ప్రచారం నిర్వహించారు. బాణసంచా కాల్చే సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఈవోకు విరాళం మొత్తాన్ని నగదు రూపంలో అందజేస్తున్న దాత ప్రభావతి

ఆర్చ్ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కాకినాడ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యారావుపేటలో బాలాత్రిపుర సుందరి ఆలయ ముఖ ద్వారం వద్ద ఆర్చ్ నిర్మాణం నిమిత్తం కాకినాడకు చెందిన బిరదా వీర ప్రభావతిసూర్యనారాయణ రూ.1,00,116 విరాళం అందించారు. ఈ మొత్తాన్ని నగదు రూపంలో మంగళవారం ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరికి ఇచ్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అన్నదాన పథకానికి లక్ష విరాళం

పెద్దాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తొలి తిరుపతిలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శృంగార వల్లభస్వామి దేవస్థానంలో అన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన బుడ్డేపు లక్ష్మీపార్వతి రూ.లక్ష విరాళం అందించినట్టు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు పాల్గొన్నారు.

17న జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 17వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీగోపాల్ ఆటోమోటివ్, అపోలో ఫార్మసీ, ఎస్‌బీఐ గ్రూప్, టీంలీస్ సర్వీసెస్ కంపెనీల్లో పనిచేయడానికి ఆసక్తి గల పురుషులు, మహిళలు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కార్యాలయానికి ఉదయం పది గంటలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8639846568 నెంబరును సంప్రదించాలని సూచించారు.



ఘనంగా సీతారామస్వామి శాంతి కల్యాణం

కాకినాడ సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మెయిన్‌రోడ్డులో గల సీతారామస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి జన్మ నక్షత్రం పునర్వసు సందర్భంగా శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ చైర్మన్ పులవర్తి విశ్వనాథం దంపతులు, డైరెక్టర్ తురగా సూర్యారావు దంపతులతో ప్రధానార్చకుడు కల్యాణం జరిపించారు. ఆలయ మాజీ చైర్మన్ పులవర్తి సీతారామయ్య దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈవో, పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భారీ వర్షాలకు రహదారులు జలమయం

తాళ్లరేవు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బందిపడ్డారు. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. డ్రైనేజీలు స్తంభించడంతో పంట చేలు మునిగాయి.

'బౌద్ధ దీక్షతో మానవాళికి ఎంతో మేలు'

తాళ్లరేవు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వీకరించిన బౌద్ధ దీక్షతోనే మార్పునకు నాంది పలుకుతుందని డాక్టర్ కోరుకొండ బాబ్జీ భానుమతి అన్నారు. అంబేడ్కర్ బౌద్ధం స్వీకరించిన దినోత్సవం సందర్భంగా మంగళవారం తాళ్లరేవు అంబేడ్కర్ భవనంలో మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, త్రిరత్న బౌద్ధ దమ్మ సొసైటీ అధ్యక్షులు జక్కల ప్రసాద్ ఆధ్వర్యంలో సంయుక్త సమావేశం నిర్వహించారు. ముందు గా గౌతమబుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద జ్యోతిప్రజ్వలన చేసి పుష్పమాలలతో నివాళులర్పించారు. బుద్ధిస్టులు, ఉపాసకులు డాక్టర్ రాముడు, నరసింహమూర్తి, వరప్రసాద్, గుత్తాల సుబ్రహ్మణ్యం అంబేడ్కర్ స్వీకరించిన బౌద్ధ దీక్షపై ప్రసంగించారు. నేతలు టేకుమూడి లక్ష్మణరావు, కట్టా త్రిమూర్తులు, వుంగరాల వెంకటేశ్వరరావు, డ్వాక్రా యానిమేటర్లు, కాశి లక్ష్మణస్వామి, టేకుమూడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

రామాలయం వద్ద అన్నదానం

ప్రత్తిపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ధర్మవరం జువ్వల వారి వీధి రామాలయం వద్ద మంగళవారం సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి రామాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. సానా నూకరాజు నాయుడు, జువ్వల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

వ్యవసాయానికి అనువుగా ఉన్న భూములు గుర్తించాలి

● జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం, అక్టోబర్14 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితుల గ్రామాల్లో వ్యవసాయానికి అణువుగాఉన్న భూమిని గుర్తించి నివేదికలు సమర్పించాలని అల్లూరి సీతారామరాజుజిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్‌తో కలిసి పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్లలో బాధితులకు అణువుగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భూమిని గుర్తించాలన్నారు. భూములు కొనుగోలు చేసే గ్రామాలలో గ్రామసభల కార్యాచరణపై సమీక్షించారు. ముంపు బాధితులకు నచ్చిన భూములను ఎంపిక చేయాలని సూచించారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో శ్మశానవాటిక లేని గ్రామాలకు భూములు కొనుగోలుచేసి ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.అంబేడ్కర్, కే.నాసరయ్య, అంజనేయులు, జి.బాలకృష్ణ, కె.సతీష్, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, తహశీల్దార్లు ఏ.సత్యనారాయణ, కరక సత్యనారాయణ, సీహెచ్ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, ఎస్‌బీవీ రెడ్డి, రవికుమార్, మురళీ, ఆర్‌అండ్‌ఆర్ అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్యే శిరీషదేవి



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా అనేకరకాల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని క్రమప ద్ధతి లో పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్స న్ మిరియాల శిరీషదేవి అన్నారు. ఈమేర కు రంపచోడవరం పర్యటనలో ఉన్న అల్లూరిజిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రహదారులు మెరుగుపర్చాలని, విలీన మండలాల్లో గోదావరి ముంపు గ్రామాల సమస్యలు కలెక్టర్‌కు క్షుణ్ణం గా వివరించి పరిష్కరించాలని కోరారు. అటవీ అభ్యంతరాలతో నిలిచిపోయిన రహదారుల పనులు ప్రస్తావించి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర దూదేకుల కార్పోరేషన్ డైరెక్టర్ షేక్ సుభాన్, టీడీపీ నాయకులు గురుకు శేషుకుమార్, కర్రి సన్యాసిరెడ్డి, వై.నిరంజనీదేవి, మళ్ల దుర్గాప్రసాద్ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పనుల మంజూరు కోసం కలెక్టర్‌ను కలిసిన శీతంశెట్టి

రంపచోడవరంలో వివిధ పనులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రి సమీపంలో ఉన్న బ్రిడ్జి, పాత దేవీగుడి సెంటర్ నుంచి పాత ఆంధ్రబ్యాంక్ వరకు డ్రైనేజీ, భూపతిపాలెం జలాశయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి, ప్రధాన కూడలిలో రింగ్‌రోడ్డు పనులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.



వైభవంగా దారాలమ్మ జాతర

మోతుగూడెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మో తుగూడెం పొల్లూరు గ్రామాలమధ్య ఉన్న దారాలమ్మతల్లి జాతరను మంగ ళవారం వైభవంగా జరిగింది. ఈ జాతరకు వేలాది భక్తులు పోటెత్తారు. ప్రతి ఏడాది ఇక్కడ దారాలమ్మ ఆలయంవద్ద జరిగే జాతరకు ప్రత్యేకత ఉండడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. జాతర సంద ర్భంగా ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి ప్రధాన అర్చకు డు అయినవిల్లి కుమార్‌స్వామిశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొల్లూరులో తీన్మార్ డప్పు వాయిద్యాలతో ఆలయ ధర్మకర్త వెంకటేశ్వరరావు మణి దంపతులు ఇంటి నుంచి ఊరేగింపు పొల్లూరు గ్రామం పురవీధుల్లో ఊరేగిస్తూ ఈ గరగలను దారాలమ్మ తల్లి ఆలయం లోపలికి తీసుకొచ్చారు. అనంతరం ఈ గరగలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుంకుమ పూజ చేశారు. ముఖ్యఅతిథులుగా సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ రాజారావు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ బి.బాలకృష్ణ డీఈటీ వరప్రసాద్, సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ వరప్రసాద్, సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, నెల్లూరు ఏపీ జెన్కోలో జెవోగా పనిచేస్తున్న బండ రాజేష్ ఈ జాతరకు విచ్చేశారు.

టీడీపీ మండలాధ్యక్షుడిగా భాస్కరరావు

కూనవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూనవరం టీడీపీ మండలాధ్యక్షుడిగా ఎడవల్లి భాస్కరరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి భాస్కరరావును కూనవరం మండల అధ్యక్షుడిగా ప్రకటించారు. పార్టీ మండల స్థాయి వివిధ శాఖల నుంచి భాస్కర్‌రావుకు సంపూర్ణ మద్దతు లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషదేవి ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు.

చేతబడి చేస్తున్నాడని కత్తితో దాడి

చింతూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చేతబడి చేస్తున్నాడని కత్తితో దాడిచేసి గాయపర్చిన ఘటన ఇది. చింతూరు ఎస్‌ఐ రమేష్ కథనం మేరకు మండలంలోని చిడుమూరుకు చెందిన బొక్కిలి మల్లయ్య అదే గ్రా మానికి చెందిన దుర్వ పిచ్చయ్యపై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. దుర్వ పిచ్చయ్య మంత్రగాడన్నది మల్లయ్యకు అనుమానంగా ఉంది. మల్లయ్య మనుమ రాలు కొద్ది కాలంగా అనారోగ్యం బారిన పడింది. దీనికి కారణం పిచ్చయ్య చేసిన చేతబడేనన్నది మల్లయ్య విశ్వాసం. దీంతో ఆగ్రహానికి గురైన మల్లయ్య సోమవారం రాత్రి పిచ్చయ్య ఇంటి సమీపంలో కత్తితో దాడి చేశాడు. దీంతో గాయపడ్డ పిచ్చయ్య అరవడంతో అది విన్న పిచ్చయ్య కుమారుడు విజయ్‌కుమార్ తండ్రి వద్దకు పరుగున చేరుకున్నాడు. ఈ క్రమంలో మల్లయ్య విజయకుమార్‌పై కూడా కత్తితో దాడి చేయబోగా తప్పించుకున్నాడు. చివరకు సమీపవాసులంతా సంఘ టనా స్థలం వద్దకు చేరుకోవడంతో అక్కడి నుంచి మల్లయ్య పారిపోయాడని ఎస్‌ఐ తెలిపారు. గాయపడ్డ పిచ్చయ్య ప్రస్తుతం చింతూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి: కలెక్టర్

అడ్డతీగల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు ఉపాధ్యాయులు విద్యను బోధించాలని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం రాత్రి అడ్డతీగల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, వీరవరం గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు.

ఉపాధి హామీలో రూ.17కోట్లు పనులకు సామాజిక తనిఖీ

వై.రామవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలంలో 2024-25 సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై మంగళవారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పీడీ డాక్టర్ డి.విద్యాసాగర్, ఏపీడీ టీఎస్ విశ్వనాథ్‌ల ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. 2278 పనులకు రూ.17.54కోట్లకు సంబంధించిన పనుల్లో ఈ తనిఖీ జరిపారు. ఉపాధి హామీ, ఐటీడీఏ, పీఆర్ శాఖల్లో రూ.68లక్షల పనుల కొలతల్లో తేడాకు తిరిగి ఆ పనులు చేయించాలని పీడీ ఆదేశించారు. సిబ్బంది నుంచి రూ.6789 రికవరీకి ఆదేశించారు.

పేదల కోసమే జీఎస్టీ సంస్కరణలు: ఎమ్మెల్యే సత్యప్రభ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పేదల కోసం ఎన్డీయే ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి తెచ్చిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. బీవీఆర్ ఫంక్షన్ హాల్లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి జీఎస్టీ అవగాహన సదస్సును ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం అన్ని వర్గాలకు మేలు చేయడమే లక్ష్యంగా నూతన జీఎస్టీ 2.0తో సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. నూతన జీఎస్టీతో వస్తువుల ధరలు తగ్గి ప్రజలకు కొనుగోలు శక్తి పెరుగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. నిత్యావసర వస్తువులు, ఔషధాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్లు, కారులు, ద్విచక్రవాహనాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గాయన్నారు. జిల్లా కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జి.పద్మావతి మాట్లాడుతూ జీఎస్టీ నూతన సంస్కరణల వల్ల రాష్ట్రంలో ప్రభుత్వానికి రూ.8వేల కోట్ల ఆదాయం తగ్గుతుందని తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు జీఎస్టీ సంస్కరణల ఫలితాలు వివరించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బత్తిమణి రామారావు, ఏలేశ్వరం మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య, టీడీపీ నాయకులు పర్వత సురేష్, మూది నారాయణ స్వామి, బదిరెడ్డి గోపి, అమరాది వెంకట్రావు, లొండా లోవరాజు, ధర్మవరం సొసైటీ చైర్మన్ దాసం శేషారావు, రాష్ట్ర ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, ఎంపీపీ గంటుమళ్ళ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యేనా..!



పనులు నిలిచిపోయిన కోటనందూరు ఎంఈవో కార్యాలయం

కోటనందూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కోటనందూరు ఎంఈవో కార్యాలయ పనులు అసంపూర్ణంగా నిలిచిపోయాయి. సుమారు 15ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.5లక్షలతో మండల విద్యాశాఖ కార్యాలయంపైన నిర్మాణ పనులు చేపట్టారు. అప్పటినుంచి పనులు పూర్తికాలేదు. ఉన్నతాధికారులు స్పందించి పనులుపూర్తి చేయాలని సిబ్బంది కోరుతున్నారు.

కాశి కావిడి కళా ప్రదర్శన



ధర్మవరంలో కాశి కావిడి కళాప్రదర్శన దృశ్యం

ప్రత్తిపాడు,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో గౌరీశంకర్ల 89వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం కాశీ కావిడి ప్రదర్శన ఆద్యాంతం కడుపుబ్బ నవ్వించింది. గురువ, బలిజ వీర్రాజు, శిష్యులుగా, మహిళలుగాదండాచిన్నారావు, మంతెన శ్రీను, ఇనపకుర్తి వీరబాబు, గరగ వీరబాబు, దండా అనిల్‌కుమార్, మంతెన లోవరాజు, చెన్నాడ శివ, మట్టా మనోజ్‌కుమార్ నటించారు.

బాణసంచా దుకాణాల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు



జగ్గంపేటలో స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

జగ్గంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని జగ్గంపేటలో బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసే స్థలాన్ని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, జగ్గంపేట తహశీల్దార్ రమేష్ పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ బాణసంచా అమ్మకాలు జరిపే ప్రదేశంలో ఎటువంటి అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దుకాణాల మధ్య పది అడుగుల దూరం ఉండేలా షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి దుకాణం దగ్గర నీళ్ల, కార్బన్‌డయాక్సైడ్ సిలిండర్లు, ఇసుక తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జెడ్.రాగం పేటకు చెందిన కట్టు పద్మనాభం ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులకు రూ.15లక్షల బీమా నమూనా చెక్కును జగ్గంపేట పోస్టాఫీస్ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అందజేశారు. ఈసందర్భంగా నవీన్ మాట్లాడుతూ తపాలా శాఖ 160ఏళ్లుగా ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, టీడీపీ మండలాధ్యక్షుడు జీను మణిబాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కార్పొరేషన్ డైరెక్టర్లు కొత్త కొండబాబు, పోతుల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

కోటనందూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలు జీఎస్టీపై మరింత అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం కాకరాపల్లి గ్రామంలో దుకాణాల వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎస్టీ వల్ల ప్రతి కుటుంబానికి ఆదాయం మిగులుతుందన్నారు. టీడీపీ నేత సామినీడు కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.



కాకరాపల్లిలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

స్విమ్మింగ్‌లో ఆదిత్య యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రతిభ

గండేపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తోన్న ఎంవీ కుమార్‌రెడ్డి ఆదివారం మంగళగిరి శంషేర్‌ఖాన్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన 7వ నేషనల్ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ 2025లో సత్తా చాటి మూడు పతకాలు గెలుచుకున్నారని ప్రో చాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. స్విమ్మింగ్‌లో బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం(25ఎం), బట్టర్‌ఫ్లైలో కాంస్య పతకం(25ఎం), ఫ్రీ స్టైల్‌లో రజతం పతకం(25ఎం) గెలుచుకున్నారని వివరించారు. విజేతను సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్ అభినందించారు.

ముగిసిన వర్క్‌షాప్స్

ఆదిత్య యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు వారాల పాటు నిర్వహించిన స్ట్రక్చరల్ డిజైనింగ్ యూజింగ్ ఎటాబ్స్, బిల్డింగ్ డ్రాఫ్టింగ్ యూజింగ్ ఆటో క్యాడ్-2 వర్క్‌షాప్స్ విజయవంతంగా ముగిశాయి. విద్యార్థులు భవన నిర్మాణ రూపకల్పన, డ్రాఫ్టింగ్ విషయాల్లో ఆధునిక సాఫ్ట్‌వేర్ల వినియోగాన్ని నేర్చుకున్నారు.

నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం

ప్రత్తిపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు, రౌతులపూడి మండలాలకు నూతనంగా ఎంపికైన నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నియామక పత్రాలు అందజేశారు. ప్రత్తిపాడులో మంగళవారం ప్రత్తిపాడు మండలం పోతులూరుకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా విమణి కంఠ, పాండవుల పాలేనికి నాగులాపల్లి దేవి, చింతలూరుకి తూము నాగేంద్రబాబు, రౌతులపూడికి నంబూరి వీరబాబులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్, ఏపీవో కుమార్‌స్వామి పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ కాంటీన్ నిర్వహించారు. తుమ్మలపల్లి పేదలకు అన్నం వడ్డించారు. 500మందికి అన్నదానం నిర్వహించారు. జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న తుమ్మలపల్లి రమేష్



యనమలతో సమావేశమైన ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

యనమలతో ఎమ్మెల్యే సత్యప్రభ భేటీ

తుని రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మంగళవారం తుని మండలం తేటగుంట క్యాంప్ కార్యాలయంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను యనమలకు వివరించారు. అలాగే పార్టీ సంస్థాగత ఎన్నికలపై చర్చ జరిగింది. ఈ భేటీలో తుని మండలాధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి, పార్టీ సీనియర్ నాయకులు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, యనమల లక్ష్మణరావు, చిటికెల శ్రీనివాసరావు, అడిగర్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

తొండంగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)): అన్నయ్యపేట వద్ద జూదం ఆడుతున్న వారిపై దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి రూ.81903 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తొండంగి పోలీసులు తెలిపారు. తుని మండలం ఎన్.సూరవరం గ్రామానికి చెందిన వి.రమణతోపాటు మరో ఆరుగురు మంగళవారం ఓడు-గెలుపు జూదం ఆడుతుండగా వారిపై దాడి చేసి నగదుతో పాటు 54 ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్‌ఐ జగన్మోహన్ సిబ్బందితో దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నారన్నారు. దీనిపై కేసు నమోదు చేశారు.

వైసీపీ నిరసన ర్యాలీ

జగ్గంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం కారణంగా ప్రాణనష్టం జరుగుతుందని మాజీ మంత్రి, వైసీసీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ అధ్యక్షతన జగ్గంపేటలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట సీఐ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సీఐకు వినతిపత్రం అందజేశారు.

స్కేటింగ్‌లో శ్రీ ప్రకాష్ విద్యార్థి ప్రతిభ



ప్రతిభ కనబరిచిన కళానిధి

తుని రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థి టి.కళానిధి ఎంపికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ద్వారా అక్టోబరులో 10 వ తేదీ నుంచి 12 వరకు కాకినాడలో నిర్వహించిన పోటీల్లో కళానిధి ప్రతిభ కనబరిచారు. రోడ్ 100 మీటర్లలో గోల్డ్ మెడల్, రోడ్ 500 మీటర్లలో గోల్డ్ మెడల్, రింక్ 500 మీటర్లలో గోల్డ్ మెడల్, రింక్ 1000 మీటర్లలో కాంస్య పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థిని విద్యా సంస్థల అధినేత సీహెచ్ వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రధానోపాధ్యాయురాలు డి.సీతారాణి తదితరులు అభినందించారు.

అడవిపంది మాంసం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

రౌతులపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అడవిపంది మాంసం అమ్ముతున్న ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన పల్లా తలుపులును అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరు పరిచినట్లు ఎఫ్ఎస్‌వో నాగేశ్వరరావు తెలిపారు. అడవి జంతువులను వేటాడినా లేదా కరెంట్ పెట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొండంగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగిన గోపాలపట్నం గ్రామానికి చెందిన సంగన సత్తిబాబు (35) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. ఈ నెల 13న సత్తిబాబు బెండపూడి శివారు ఎస్సీపేట చెరువు వద్ద పురుగుల మందు తాగి ఉండడాన్ని గమనించి స్థానికులు కుటుంబ సభ్యులకు తెలిపారు. అతడిని తుని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడకు తరలించారు. మంగళవారం అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆయన తెలిపారు. అతడి భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

అన్నవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో ఉత్సాహం కనబరచాలని ప్రిన్సిపాల్ శ్రీరామ్‌మోహన్‌రావు అన్నారు. మంగళవారం అన్నవరంలో సత్యదేవా జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం లో విద్యార్థులకు వాలీబాల్, రన్నింగ్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమ తులను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ అందజేశారు. కాకినాడ సెంట్రల్ బోర్డు మెంబర్ చిత్ర పాపారావు, కొంబాబు, శ్రీమతి అరుణ్ కుమారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ

తుని రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తుని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాలను ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పట్టాభి చౌదరి మంగళవారం తనిఖీ చేశారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్న వార్తల్లో వాస్తవం లేదని, ప్రజలను గందరగోళానికి గురి చేసే ఈ ప్రచారం చట్ట రీత్యా నేరమన్నారు. ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 25 మద్యం దుకాణాల్లో మద్యం సీసాలను పరి శీలించి అన్ని సక్రమంగానే ఉన్నట్టు గుర్తించామన్నారు. అక్రమ మద్యం అమ్మకాలు ఎవరి దృష్టిలోనైనా ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు.

డిప్యూటీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

తుని రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలతోపాటుగా కేజీబీవీ పాఠశాలను డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎన్.శ్రీధర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గిరిజన పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి శుద్ధి యంత్రం మరమ్మతులకు గురవ్వడంపై ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులతో మాట్లాడిన ఆయన వార్డెన్ అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించి సంబంధిత విషయంపై చర్యలు చేపడతామని తెలిపారు. కేజీబీవీ పాఠశాలలో వసతి గృహాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సాయి నవీన్ తదితరులు ఉన్నారు.



గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్



యర్రవరంలో వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్న అధికారులు

పంట సాగుపై రైతులకు అవగాహన

ఏలేశ్వరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): యర్రవరం గ్రామంలో ఉద్యానశాఖ అధికారి దివ్యశ్రీ నేతృత్వంలో మంగళవారం పంట సాగు చేసే విధానంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు జీవన ఎరువుల విధానాన్ని పెంపొందించుకోవడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు లాభసాటిగా ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు బసా ప్రసాద్, మైరాల కనకారావు, తోట వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఏలేశ్వరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎల్‌పీవో బాలామణి అన్నారు. మంగళవారం మండలంలోని యర్రవరం, భద్రవరం, పేరవరం గ్రామాల్లో ఆమె పర్యటించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, పారిశుధ్యాన్ని పరిశీలించారు. చెత్త సేకరించేటప్పుడు తడి, పొడి చెత్తను చేసి సంపద కేంద్రాలకు తరలించాలని పంచాయతీ సిబ్బందికి తెలిపారు. పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శి రామరాజు వర్మ ఉన్నారు.



యర్రవరంలో పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో బాలామణి